సాక్షి
మహబూబ్‌నగర్

గురువారం, 2, అక్టోబర్, 2025



దసరా వైభవం



దసరా వేడుకల సందర్భంగా వెలుగుతున్న వివిధ రకాల అస్త్రాలు(ఫైల్)

సంబరాలు కేరాఫ్ పాలమూరు

- దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 42 ఏళ్ల నుంచి వేడుకలు
- పలు అస్త్రాల పేర్లతో టపాసుల మోతలు
- ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా సంబరాలకు మహబూబ్‌నగర్ నగరం కేరాఫ్‌గా నిలుస్తోంది. ప్రతి ఏడాది ఇక్కడ జరిగే దసరా వేడుకలు ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్నాయి. దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 42 ఏళ్ల నుంచి పండుగ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదట 19 ఏళ్లు టీడీగుట్ట ప్రాంతంలో ఉత్సవాలు నిర్వహించగా 21 ఏళ్లు జెడ్పీ మైదానంలో దసరా వేడుకలను నిర్వహించారు. 2023లో మినీ ట్యాంక్‌బండ్ వద్ద దసరా సంబరాలు నిర్వహించారు గతేడాది నుంచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది దసరా పండుగకు సంబంధించి ధ్వజధారిని నిర్ణయిస్తారు. ఈసారి ధ్వజధారిగా కలకొండ సూర్యనారాయణ వ్యవహరిస్తున్నారు. పండుగ రోజు ఆర్యసమాజం మందిరంలో గురువారం ఉదయం 8 గంటలకు దేవయజ్ఞం, వేదోపదేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడి నుంచి కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుతో బయలుదేరుతారు. ధ్వజధారి ధ్వజాన్ని ధరించి 3 గంటలకు రాంమందిర్ చౌరస్తాలో గల దసరా కట్ట దగ్గర జనసమ్మేళనాన్ని నిర్వహిస్తారు.

నగర వీధుల గుండా ర్యాలీ...

ఉత్సవ జెండాతో నగర ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ చేపడుతారు. ముందుగా పాన్‌చౌరస్తా నుంచి వచ్చిన భారీ ర్యాలీకి క్లాక్‌టవర్ వద్ద ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ర్యాలీ ట్యాంక్‌బండ్ వద్దకు వద్దకు చేరుకుంటుంది. వేడుకలను పురస్కరించుకొని మైదానంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. అనంతరం తదుపరి పలు అస్త్రాల పేరుతో ఏర్పాటు చేసిన రంగురంగుల టపాసులను పేలుస్తారు. వేడుకల కోసం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం సిద్ధమవుతోంది. ఒక వైపు ప్రధాన వేదిక, మరో వైపు బాణాసంచా కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు.



జగన్మాత దుర్గాదేవి మహిషాసురమర్దినిగా పూజలందుకున్న వేళ. అర్జునుడు జమ్మిచెట్టు మీద నుంచి ఆయుధాలు తీసిన రోజు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంతో భక్తులను అలరించే ఘడియ. లక్ష్మీ పూజ, సరస్వతీ పూజ, ఆయుధ పూజ, శమీ పూజ.. ఇలా అన్నీ శుభాలే. మది నిండా సంతోషాలతో దసరా సరదాలతో తెలుగింటి 'నవ దుర్గల' ఆశీస్సులతో విజయీభవ..

విజయదశమి.. చెడుపై విజయం సాధించినందుకు చిన్నంగా నిర్వహించుకుంటాం. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటాం. రోజుకో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా తమ సంప్రదాయరీతిలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇప్పటికే దసరా సందడితో జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది కూడా ఘనంగా ఆనందోత్సహాల మధ్య జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్



కనకదుర్గ రూపంలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బుధవారం కనకదుర్గ రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మహామంగళహారతి, సాయంత్రం కల్పవృక్ష వాహన సేవ చేపట్టారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్



వాహన సేవల విజయయాత్ర (ఫైల్)

పాలమూరులో విజయయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం బ్రాహ్మణవాడిలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు అమ్మవారిని ప్రత్యేక రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. వాసవీ దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. దశమి మరుసటి రోజు జిల్లాకేంద్రంలో అమ్మవారి ఉత్సవ వాహన సేవల విజయయాత్రను వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది వాహనసేవల విజయయాత్ర అమ్మవారి దేవాలయం నుంచి బయలుదేరి రాంమందిర్ చౌరస్తా, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, తూర్పు కమాన్, నగరేశ్వర దేవాలయం మీదుగా సాగుతుంది.

ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం నింపాలి: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు వాసులు విజయదశమి పండుగ సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, విజయం నింపాలని ఆకాంక్షించారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ స్నేహభావంతో ఉండాలని, ఆరోగ్యకరమైన వాతావరణంలో వేడుకలు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తుందని, నిరంతరం పెట్రోలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. డీజేలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి లేదని గొడవలు లేకుండా ప్రశాంతంగా దసరా జరుపుకోవాలని కోరారు.

కులమతాల కలయిక ఖౌమి ఏక్తా కమిటీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఖౌమి ఏక్తా కమిటీ కులమతాలు, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తోంది. పట్టణంలో అన్ని మతాల పండుగల్లో కులమతాలకతీతంగా శుభాకాంక్షలు తెలపాలనే ఉద్దేశంతో 1981 సంవత్సరంలో అధ్యక్షుడిగా షాబుద్దీన్ ఖాద్రీ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ఖౌమీ ఏక్తా కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కమిటీ అధ్యక్షుడిగా భగవంతురావు, ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఉర్దూజర్నలిస్ట్ రఫీక్ పటేల్ ఉన్నారు. మహబూబ్‌నగర్ ఖౌమి ఏక్తా కమిటీ ఉమ్మడి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. హిందూవుల దసరా పండుగ రోజు క్లాక్‌టవర్ వద్ద, ముస్లింల రంజాన్, బక్రీద్‌లో ఈద్గా సమీపంలో, మిలాదున్నబీలో అంబేద్కర్ చౌరస్తా, సంబంధించి క్రిస్మస్ పండుగలో ఎంబీ చర్చి ఆవరణల్లో ప్రత్యేక స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తారు. ఆయా పండుగ రోజుల్లో వేదిక వద్దకు చేరుకొని కులమతాలకతీతంగా ప్రజలు పండుగ శుభాకాంక్షలు తెలుపడం ఆనవాయితీగా వస్తోంది.



దసరా వేడుకల్లో ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద నాయకులు (ఫైల్)

రాష్ట్రంలో ఎక్కడా లేదు..



అన్ని పండుగల్లో కుల మతాలు, పార్టీలకతీతంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకోవాలనే ఉద్దేశంతో ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. ఇలాంటి కమిటీ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలో ఎక్కడా లేదు. 28 ఏళ్ల నుంచి ఖౌమీ ఏక్తా కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉంది. – **రఫీక్‌పటేల్**, ఖౌమి ఏక్తా కమిటీ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్



క్లాక్‌టవర్ నుంచి పాన్‌చౌరస్తా వరకు కొనుగోలుదారులతో కిక్కిరిసిన దృశ్యం

దసరా కిక్కు..!

డిపోల నుంచి రూ.61.02 కోట్ల మద్యం తరలించిన వ్యాపారులు

- ముందస్తు జాగ్రత్తపడిన మద్యం ప్రియులు
- బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వైన్స్ షాపులకు క్యూ..
- నూతన దుస్తులు, పండుగ సరుకుల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

మహబూబ్‌నగర్ క్రైం: దసరా పండుగ రోజే గాంధీ జయంతి రావడంతో వైన్స్ యజమానులు, మద్యం ప్రియులు అప్రమత్తమయ్యారు. గురువారం వైన్స్ షాపులు బంద్ ఉంటాయనే కారణంతో మంగళ, బుధవారం నుంచే మద్యం కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. ఇక దసరా అంటేనే వివిధ ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు స్వగ్రామాలకు వచ్చి కుటుంబసభ్యులు, బంధువులతో సంబరంగా జరుపుకొంటారు. ఈ వేడుకల్లో మద్యం, మాంసం ప్రముఖ పాత్ర పోషిస్తుంటాయి. దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో చాలామటుకు మద్యం ముందుగానే కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. మరికొంత మంది దసరా తర్వాత రోజు కరీ పండుగ చేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. ఇక వైన్స్‌లకు దసరా పండక్కి పెద్ద ఎత్తున గిరాకీ ఉంటుంది. ఇదే అదునుగా వారం రోజుల నుంచే వైన్స్ యజమానులు తిమ్మాజిపేట, కొత్తకోట డిపోల నుంచి రూ.కోట్ల విలువైన స్టాక్ కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నారు.



తిమ్మాజిపేట డిపోలో మద్యం విక్రయాలు

తేదీ	ఐఎంఎల్	బీర్లు	అమ్మకపు విలువ (రూ.కోట్లలో)
28.09.25	1,288	2,581	1.55
29.09.25	12,564	10,671	12.19
30.09.25	16,131	16,065	15.90
1.10.25	7,643	13,877	8.45
కొత్తకోట డిపో పరిధిలో..			
28.09.25	800	476	1.53
29.09.25	8,375	7,400	8.08
30.09.25	9,806	8,130	9.54
1.10.25	2,740	4,460	3.78

కిటకిటలాడిన షాపింగ్‌మాల్స్

ఇక విజయదశమి అంటేనే ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి ఆనందంగా జరుపుకొంటారు. దీంతో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాకేంద్రాలతో పాటు పట్టణాల్లోని షాపింగ్ మాల్స్‌తో పాటు ఇతర వస్త్ర దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. కుటుంబాలు, యువకులు, మహిళలు అన్ని వర్గాల వాళ్లు పండుగ షాపింగ్ చేయడంతో మార్కెట్లు రద్దీగా మారాయి. పాలమూరు నగరంలో ప్రధానంగా క్లాక్‌టవర్, న్యూటౌన్ ఏరియాల్లో ఉన్న వస్త్ర దుకాణాలతో పాటు నిత్యావసర సరుకుల కోసం జనాలు సూపర్‌మార్కెట్లకు ఎగబడ్డారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని రకాల దుకాణ సముదాయాల్లో రద్దీ కనిపించింది.

'స్థానిక' ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ విజయేందిర బోయి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి)ని పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహణకు సహకరించాలన్నారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూట్నీ, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల వ్యయ పరిమితి ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్‌కు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీపీ నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీపీఓ పార్థసారథి, ఆర్డీఓ నవీన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్ ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధుల, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా

చిన్నచింతకుంట: రైతులకు యూరియా కొరత లేకుండా తగు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం–2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం గోదాంలో ఉన్న యూరియా, ఎరువులతోపాటు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఆగ్రోసేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు, పురుగుల మందుల విక్రయాల్లో తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎల్లయ్య, ఏఓ రాజేష్‌ఖన్నా, ఆర్ఐ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ యోగాసన పోటీల్లో వనజారెడ్డికి పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకు చెందిన యోగ క్రీడాకారిణి వనజారెడ్డి జాతీయస్థాయి యోగాసన పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారు. విజయవాడలో గత నెల 28 నుంచి బుధవారం వరకు జరిగిన సీనియర్–సీ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌సిప్‌లో వనజారెడ్డి రెండు విభాగాల్లో పతకాలు సాధించారు. ట్విస్టింగ్‌లో బంగారు పతకం, ఫార్వార్డ్ బెండింగ్‌లో కాంస్య పతకాలు పొందారు. పోలీస్‌శాఖలో ఏఎస్ఐగా పనిచేస్తున్న వనజారెడ్డి గత కొన్నేళ్ల నుంచి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో, యోగా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తాం



కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బాకీ కార్డులను ఆయన విడుదల చేశారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ బాకీ కార్డు ఉద్యమం ప్రారంభిందని చెప్పారు. అభయ హస్తం పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోయారన్న భ్రమలో పార్టీ నేతలు ఉన్నారని, వారి అబద్ధపు హామీలను అందరికీ గుర్తు చేసేందుకే బాకీ కార్డు ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ బావుల వద్ద మీటర్లు పెట్టేందుకు సిద్ధం అవుతుందని, కరెంటు చార్జీలు కూడా పెంచేందుకు సన్నాహాలు చేస్తుందని ఆరోపించారు. రైతులకు యూరియా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం పండించిన పంట కొనుగోలు చేసేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం కారణంగా ఎవరికి లాభం కలిగిందో ప్రజలు ఆలోచన చేయాలని, రానున్న ఏ ఎన్నికలైనా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, నాయకులు బాలరాజు, నరేందర్, దేవేందర్‌రెడ్డి, శివరాజ్, మల్లు నర్సింహారెడ్డి, కొండా లక్ష్మయ్య, శ్రీకాంత్‌గౌడ్, నవకాంత్, వేదవత్, చెన్నయ్య, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి రాక



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వైభవ్‌రఘునాథ్ గైక్వాడ్

వంగూరు: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లికి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రానున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. రాత్రి 8 గంటలకు ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన కొడంగల్‌కు బయలుదేరుతారని ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కొండారెడ్డిపల్లిలో ఏర్పాట్లను పరిశీలించి అనంతరం హెలీప్యాడ్ వద్ద బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా అధికార యంత్రాంగం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలం హైవే రోడ్డు నుంచి కొండారెడ్డిపల్లి వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆంజనేయస్వామి, శివాలయాలకు పూలు, విద్యుత్ లైట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. గ్రామ సమీపంలో ఉన్న జమ్మిచెట్టు చుట్టూ బారికేడ్లు, లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి సోదరులు, కుటుంబ సభ్యులు కొండారెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నారు.

రద్దీ ఏరియాల్లో నిత్యం నిఘా

- షీటీంకు నెల రోజుల్లో 21 ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో సెప్టెంబర్ నెలలో షీటీం పోలీసులకు 21 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. 20 కేసుల్లో యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వగా, మరో 20 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఒక కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణ చేస్తున్నామని, 16 అవగాహన కార్యక్రమాలు, 70 హాట్‌స్పాట్ ప్రాంతాలు పర్యటించినట్లు తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైం వంటి అంశాలపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. షీటీం పోలీసులు రద్దీ ఏరియాలు, కళాశాల సమీపంలో సివిల్ డ్రెస్‌లలో నిత్యం పర్యటిస్తూ నిఘా పెడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

31 వరకు పోలీస్ యాక్ట్

మహబూబ్‌నగర్ క్రైం: శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా అక్టోబర్ 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్–1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ అమల్లో నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అన్ని రకాల సంఘాల నాయకులు, ప్రజలు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. అనుమతి లేకుండా ఏదైనా కార్యక్రమాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాత్మా.. మన్నించు!



నవాబుపేట పాత జీపీ కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన గాంధీ విగ్రహం

- జాతిపితకు తప్పా అందరికి దసరానే..
- మూడనమ్మకాలతో ప్రతిష్ఠాపనకు నోచుకోక
- ముప్పైదు ఏళ్లుగా రావిచెట్టు కిందే శిథిలావస్థకు..
- పట్టించుకోని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు

నవాబుపేట: ఎన్నో దసరాలు వస్తున్నా.., ఎన్నో గాంధీ జయంతులు వస్తున్నా.. ఇక్కడ మహాత్ముడికి మాత్రం దసరా లేనే లేదు.. ఎందుకంటే ఆయన విగ్రహ ప్రతిష్ఠకు ముందే ఉన్నచోటనే ఏండ్ల తరబడి మగ్గి శిథిలమై పోయింది. పైగా ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు.. సాక్షాత్తు నవాబుపేట మండల కేంద్రం నడిబోడ్డున రావిచెట్టుకింద విసిరివేసినట్లు ఉంటుంది. చెట్టు నీడే నివాసమై ఏండ్ల తరబడి అక్కడే ఉండి చెట్టులోనే ఒకడైనట్లు కలిసిపోయి కనిపిస్తుంది బాపూజీ విగ్రహం. నవాబుపేట మండల కేంద్రంలో దాదాపు ముప్పైఐదేళ్లకుపైగా చెట్టుకిందే మహాత్ముడి విగ్రహం పడి ఉండటం విశేషం. కాగా తాజాగా దసరా రోజే గాంధీ జయంతి కావడంతో ఈ ఘటన ప్రత్యేక చర్చకు దారితీసింది.

మూడ నమ్మకాలతోనే..

గాంధీ విగ్రహాన్ని మూడనమ్మకాల మత్తులో ఉన్న జనం దాన్ని ప్రతిష్ఠించేందుకు ముందుకు రాకపోవడంతో ఏండ్ల తరబడి గాంధీజీ విగ్రహం పెట్టిన చోటనే శిథిలమైంది. ఈ ఘటనలకు సంబంధించి

పూర్తి వివరాలు ఇలా..

దాదాపు 40సంవత్సరాల క్రితం మండలంలోని గురుకుంటలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అక్కడి ఉపాధ్యాయులు, గ్రామస్తులు గాంధీజీ సిమెంట్ విగ్రహం తెప్పించారు. కాగా ఇదే తరుణంలో విగ్రహం గ్రామానికి తీసుకొచ్చిన ఉపాధ్యాయుడికి రోడ్డుప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కీడు శంకించిన గ్రామస్తులు అక్కడి నుంచి విగ్రహాన్ని మండలంలోని పోమాల్‌కు పంపించారు. కాగా పోమాల్‌లో విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో అక్కడా గ్రామపెద్ద అనారోగ్యాంతో ఇబ్బందులు పడ్డాడు. దీంతో వారు కీడుగా భావించి కొన్ని ఏండ్ల తర్వాత 35ఏండ్ల క్రితం నవాబుపేట మండల కేంద్రానికి తీసుకొచ్చారు. ఇలా అక్కడాఇక్కడ తిప్పిన విగ్రహం ఇక్కడ కూడా స్థాపనకు ఎవరూ ముందుకురాకపోవడంతో విగ్రహం కాస్తా పెట్టిన చోటే శిథిలావస్థకు చేరింది. తాజాగా విగ్రహం ఏర్పా టు చేసే పరిస్థితి లేకుండా పోయింది. కాగా మూడనమ్మకాలతో గాంధీజీ విగ్రహం ప్రతిష్ఠకు నోచుకోలేదంటే మారుమూల ప్రాంతాల్లో నమ్మకాలు ఎలా ఉన్నాయో ఇట్టే అర్థమవు తుంది. కాగా శిథిలమైన విగ్రహం ఏం చేయాలనేది అంతుచిక్కని ప్రశ్నలా మారింది. విగ్రహాన్ని ఎక్కడపడితే అక్కడ పడేసే పరస్థితి లే దు. దీంతో శిథిలమైన విగ్రహాన్ని ఏం చేయాలనేది మండలంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

మహర్నవమి.. కాళరాత్రి పూజలు



తెప్పోత్సవానికి సిద్ధమవుతున్న హంస వాహనం



ప్రత్యేక అలంకరణలో జోగుళాంబ అమ్మవారు

- పదోరోజు జోగుళాంబదేవిగా దర్శనం
- నేడు తెప్పోత్సవం.. ఉత్సవాల ముగింపు
- తుంగభద్ర నదీ హారతి

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పదోరోజు బుధవారం అమ్మవారి ఆలయంలో మహర్నవమి కాళరాత్రి పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక మండపంలో జోగుళాంబ మాత అలంకరణలో కొలువుదీర్చి అర్చకులు పూజలు చేశారు. మహర్నవమిని పురస్కరించుకొని కాళరాత్రి పూజలు ప్రత్యేకంగా జరిగాయి. క్షేత్రంలో కుంకుమార్చనలు, చండీహోమాలు, త్రిశతి ఖడ్గమాల, అర్చనలు, అభిషేకాలు తదితర పూజలు విశేషంగా కొనసాగాయి.

తెప్పోత్సవానికి సర్వం సిద్ధం..

ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజు తెప్పోత్సవం నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి నది విహారానికి అనువుగా హంస వాహనాన్ని తీర్చిదిద్దారు. ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరానుండటంతో అందుకు తగిన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు కల్పించినట్లు ఆలయ ఈఓ దీప్తి తెలిపారు. ఈసారి నది విహార సమయంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నదిలో పర్యవేక్షించనున్నాయి.

నేడు ఉత్సవాల ముగింపు..

గురువారం ఉత్సవాల ముగింపు పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయంలో ఉదయం 8 నుంచి మహా పూర్ణాహుతి, అవభృద స్నపనం.. సాయంత్రం 4 గంటలకు శమీ పూజ, సాయంత్రం 6.30కి తుంగభద్ర నది పుష్కరఘాట్‌లో నదీహారతి ఉంటుంది. సాయంత్రం 7 గంటలకు తెప్పోత్సవం, ధ్వజ అవరోహణంతో ఉత్సవాలకు ముగింపు పలకనున్నట్లు ఆలయ ఈఓ వివరించారు.

అన్నదానానికి విరాళం..

బాలబ్రహ్మేశ్వరస్వామి నిత్యాన్నదాన సత్రంలో రెండురోజుల అన్నదానానికి గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రాంభూపాల్ రూ.50 వేల విరాళం ఈఓ దీప్తికి అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అమ్మవారి ఆలయం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో గులాబీ తోట ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు ఈఓ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం..

మహర్నవమిని పురస్కరించుకొని బుధవారం అలంపూర్ ఆలయ సముదాయంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ప్రముఖుల సందడి..

అలంపూర్ ఆలయాలను బుధవారం రైల్వే డీఆర్ఎం ముత్యాల నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్‌ప్రసాద్,రాష్ట్ర నాయకుడు పురుషోత్తంరెడ్డి దర్శించుకున్నారు. అమ్మ, స్వామివార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

జూరాలకు తగ్గిన వరద



జూరాల గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- 3.63 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 20 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 4.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల వరకు 3.63 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 20 క్రస్టు గేట్లను ఎత్తి 3.19 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 65 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు, కుడి కాల్వకు 320 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3.20 లక్షల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.068 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇదిలా ఉండగా...ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 126.46 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 77,517 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువన నారాయణపూర్ ప్రాజెక్టుకు 83,385 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.191 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 10 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 1.35 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నిలిచిన విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి 3.63 లక్షల క్యూసెక్కు ల వరద చేరుతుండడంతో విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ మేరకు బుధవారం ఎగువలో స్వల్పంగా విద్యుదుత్పత్తిని చేపట్టి నిలిపివేశారు. ఐదో రోజు ఎగువ, దిగువ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలిచినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 741.652 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు పేర్కొన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి మాతృవియోగం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శ

జడ్చర్ల: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డికి మాతృవియోగం కలిగింది. హైదరాబాద్‌లోని లక్ష్మారెడ్డి నివాసంలో ఆయన తల్లి చర్లకోల లక్ష్మమ్మ (92) బుధవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు లక్ష్మారెడ్డి నివాసానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. విషాద వార్త తెలిసిన వెంటనే జడ్చర్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. లక్ష్మారెడ్డి సొంత గ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో శుక్రవారం లక్ష్మమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. కాగా గతేడాది లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతను, ఈ ఏడాది తల్లి లక్ష్మమ్మను కోల్పోవడంపై పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం




అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మరువక ముందే మరో రోడ్డు ప్రమాదం జరిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కమలాపాడు మండల కేంద్రానికి చెందిన కురుబ బుచ్చన్నగారి పవన్‌సాయి నవీన్‌కుమార్ (34) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల కొత్త బుల్లెట్ బైక్ కొనుగోలు చేశాడు. దసరా పండగను స్వస్థలంలో జరుపుకోవాలని బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో శాఖాపూర్ వద్ద దాబా సమీపంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం వెనుక బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గొంతు వద్ద తీవ్ర రక్తస్రావమై నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో తలకు హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం చేరవేశారు. మృతుడి చిన్నాన్న హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

రాత్రి ఇద్దరు.. ఉదయం ఒకరు

శాఖాపూర్ వద్ద మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వనపర్తి జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ శాఖాపూర్ వద్ద హైదరాబాద్ వెళ్లే రోడ్డుపై ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై డీసీఎంను ఢీకొని యువకుడు దుర్మరణం చెందడం స్థానికంగా ఆందోళన రేకెత్తించింది. 12 గంటల వ్యవధిలో జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు చనిపోవడం.. రాత్రి జరిగిన ప్రమాదానికి కొంత దూరంలోనే మరొకటి జరుగడం పండుగ వేళ విషాదాన్ని నింపింది. కాగా ఇటీవల హైవేపై ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరగడం ఆందోళన కలిగిస్తోంది.

కారు కిందపడి వ్యక్తి మృతి



నర్సింహులు (ఫైల్)

మక్తల్: ఇంటి ఆవరణలో ఉన్న కారును బయటకు తీస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ముస్లాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం పూజరి రామలింగయ్యకు చెందిన కారును ఇంటి ఆవరణలో నుంచి డ్రైవర్ గోవిందురాజు రివర్స్‌లో బయటికి తీస్తున్నాడు. ఈ క్రమంలో ఆ ఇంటి కంపౌండ్ గేటు వద్ద నిల్చున్న గ్రామానికి చెందిన పాట్‌మీది నర్సిములు (56) పైకి కారు దూసుకెళ్లింది. ఘటనలో వెంకటయ్య తీవ్రంగా గా యపడ్డాడు. క్షతగాత్రుడని వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్య లు సుభద్ర, వెంకటమ్మ, పిల్లలు ఉన్నారు. మొదటి భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

ఐదు మద్యం దుకాణాలకు టెండర్లు

- జాతీయ రహదారిపై ఉన్న వాటికి అధిక డిమాండ్
- సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు



మహబూబ్‌నగర్‌లో టెండర్ వేస్తున్న వ్యాపారులు

మహబూబ్‌నగర్ క్రైం: నూతన మద్యం దుకాణాల కోసం ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఈ క్రమంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు టెండర్లు దాఖలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు, నారాయణపేట జిల్లాలో ఒక టెండర్ రావడం జరిగింది. దీంతో ఇప్పటి వరకు 227 దుకాణాలకు 8 టెండర్లు దాఖలయ్యాయి. గద్వాల, వనపర్తి జిల్లాలో ఇంకా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. నేడు(గురువారం), ఈనెల 3న ప్రభుత్వ సెలవు ఉండటంతో తిరిగి 4వ తేదీన టెండర్లు స్వీకరించనున్నారు.

సిండికేట్‌గా మారి..

ఈసారి ఒక్కో మద్యం దుకాణానికి టెండర్ ఫీజు రూ.3లక్షలు కేటాయించిన నేపథ్యంలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పాడటానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ముగ్గురు, ఐదుగురు, పది మంది ఇలా గ్రూప్‌గా ఏర్పడి ఒక్కొక్కరు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు టెండర్ ఫీజు నగదు కలపడానికి సిద్ధమవుతున్నారు. సాధారణంగా మధ్య తరగతి వాళ్లు ఒక్కరే రూ.3 లక్షలు భరించాలంటే ఇబ్బందిగా ఉంటున్న క్రమంలో సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేయాలని ఆలోచిస్తున్నారు. ఒక్కో సిండికేట్ దాదాపు ఐదు నుంచి 10 దుకాణాలకు టెండర్లు వేసే ఆలోచనలో ఉన్నారు. ఈ నెల 6న తర్వాత టెండర్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశం కన్పిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న 227 మద్యం దుకాణాలకు స్థానిక వ్యాపారులతోపాటు కర్నూల్, గుంటూర్, అనంతపురం, విజయవాడ నుంచి సైతం టెండర్లు వేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా జాతీయ రహదారిపై ఉండే మద్యం దుకాణాలకు భారీ డిమాండ్ ఉండనుంది.

వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మంగలి రమేశ్ (ఫైల్)

దేవరకద్ర: కౌకుంట్ల మండలంలోని ఇస్రంపల్లి గ్రామానికి చెందిన మంగలి రమేశ్ (30) మంగళవారం వాగు దాటుతూ ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతైన ఘటన విధితమే. రాత్రి వరకు ఎస్‌డీఆర్ఎఫ్ గజ ఈతగాళ్లతో వెతికినా ఫలితం లేకపోవడంతో తిరిగి బుధవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. వాగులో కొట్టుకుపోయిన రమేశ్ మృతదేహం కొద్ది దూరంలో లభించింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదభరితంగా వాగు

కౌకుంట్ల, ఇస్రంపల్లి మధ్య ప్రవహించే వాగు ప్రమాదభరితంగా మారింది. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వాగుపై ఉన్న వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించినా.. ఇస్రంపల్లి గ్రామస్తులు వాగును దాటుతున్నారు. సోమవారం పాష నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా కౌకుంట్లకు చెందిన మల్లేశ్ నీటిలో దూకి పాషను ఒడ్డుకు చేర్చాడు. అయితే మంగళవారం రమేశ్‌తో పాటు మరో మహిళ అలివేలమ్మ వాగును దాటుతూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా స్థానికులు అలివేలమ్మను కాపాడారు. రమేశ్ గల్లంతయ్యాడు. రెండు రోజుల్లో స్థానికులు ఇద్దరిని కాపాడడం విశేషం.



నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇలింగ్, అమెలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టి పెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.


గిల్

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.


రోస్టన్ ఛేజ్

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, పియర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


శశిరేఖ పరిచయం

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.


నయనతార

మాస్ జాతర ఫిక్స్


రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు – పవన్ కల్యాణ్


సుజిత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్

''ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.


సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

నిశ్చితార్థానికి వేళాయె


అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్లు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం


ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టినూ ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది – అనిల్ రావిపూడి


గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్‌ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేష్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.